ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



స్థానిక సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. మంగళవారం కాచిగూడ డివిజన్ మౌలానా ఆజాద్‌నగర్ బస్తీలో ఎమ్మెల్యే స్థానిక బీఆర్ఎస్ నేతలు, అధికారులతో కలిసి పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యతో పాటు, వర్షపునీరు వెళ్లడానికి ఏర్పాటుచేసిన నాలాల ద్వారా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఎమ్మెల్యేకు ప్రజలు వివరించారు. వారి నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణం స్పందించి క్షేత్ర స్థాయిలో పరిష్కరించాలని ఆదేశించారు. జలమండలి డ్రైనేజీ సమస్యలపై మరింత శ్రద్ధతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. దోమలు విజృంభించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, డాక్టర్ బద్దుల ఓంప్రకాష్‌యాదవ్, ప్రతిభ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆయుష్మాన్‌భారత్



ఆయుష్మాన్‌భారత్ కార్డులను అందజేస్తున్న కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, దీనిలో భాగంగానే ఆయుష్మాన్‌భారత్ కార్డులను అందజేస్తుందని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ తెలిపారు. మంగళవారం కాచిగూడ ఇందిరానగర్ బస్తీలో పేదలకు ఆయుష్మాన్‌భారత్ కార్డులపై అవగాహన కల్పించారు. ఆయుష్మాన్‌భారత్ ద్వారా పేదలకు రూ.5లక్షల వరకు ఆరోగ్యబీమా వర్తిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డులను అందించేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరీక్షించి ఆయుష్మాన్ భారత్ నెంబరును ఫోన్ ద్వారా నమోదు చేస్తున్నట్లు వివరించారు. డాక్టర్ మనోజ్‌రెడ్డి, పద్మజ, ఇంద్రజ, సబిత, అనురాధ, లావణ్య, బీజేపీ నాయకులు మల్లికార్జున్, భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, రమా, వెంకట్, సునీల్, ఆర్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

25న ఏఐజీ ఆస్పత్రిలో కేన్సర్‌పై సమ్మేళనం

మైలోమాఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్ కన్వీనర్ సుబ్రహ్మణ్యమణి



సుబ్రహ్మణ్యమణి

కవాడిగూడ: మల్టిపుల్ మైలోమా కేన్సర్ సర్వైవర్స్ అండ్ సపోర్టర్స్ సమ్మేళనం ఈ నెల 25న గచ్చిబౌలీలోని ఏఐజీ ఆస్పత్రిలో నిర్వహిస్తున్నట్లు మైలోమా ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్ కన్వీనర్ సుబ్రహ్మణ్యమణి వివరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మల్టిపుల్ మైలోమా కేన్సర్‌తో బాధపడేవారు, ఈ వ్యాధిభారిన పడి కోలుకుంటున్న వారు, వారికి అండగా నిలుస్తున్న కుటుంబసభ్యులకు ధైర్యం కలిగించేందుకు ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మల్టిపుల్ మైలోమా బాధితులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కాలానుగుణంగా వైద్యంలో వస్తున్న మార్పులు, ప్రముఖ వైద్యనిపుణులు ఈ సమ్మేళనంలో తెలియజేస్తారన్నారు. రాజకీయాలు, ప్రాంతాలకు అతీతంగా, కేవలం మల్టిపుల్ మైలోమా కేన్సర్ బాధితుల సంక్షేమం కోసం తమ ట్రస్ట్ పనిచేస్తుందన్నారు. నగరంలో ఉన్న మల్టిపుల్ మైలోమా కేన్సర్ బాధితులు ఈ సమ్మేళనంలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రస్ట్ ఫౌండర్ మేవాడ దిలీప్‌కుమార్, ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ బాలసాహెబ్, డాక్టర్ వంశీకృష్ణ, నిమ్స్ ఆస్పత్రి డాక్టర్ సదాశివుడు, డాక్టర్ బాల స్టాలిన్ చౌదరి, కిమ్స్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ నరేందర్‌కుమార్ తదితర వైద్యనిపుణులు పాల్గొని వారి సందేశాలను అందజేస్తారని స్పష్టం చేశారు.

'సీట్లు ఇచ్చిన పార్టీలకే బీసీల మద్దతు'



మాట్లాడుతున్న బీసీ సేనా జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

ముషీరాబాద్: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో అన్ని రాజకీయపార్టీలు బీసీలకు సీట్లు ఇచ్చిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని బీసీ సేనా జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. బీసీలకు ఎనిమిది టికెట్లు కేటాయించాలని చెప్పారు. మంగళవారం విద్యానగర్ బీసీభవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ అధ్యక్షతన వివిధ బీసీ సంఘాల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బర్క కృష్ణ మాట్లాడారు. ఎన్నికల సమయంలో పార్టీలోకి వలస వచ్చిన వారికి టికెట్లు కేటాయిస్తూ.. బీసీలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీసీలను ఓట్లువేసే యంత్రాలుగానే వాడుకోవాలని చూస్తే బీసీ శ్రేణులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. శ్రీశైలంయాదవ్, చెన్నయ్య, వెంకటేష్‌యాదవ్, బాలస్వామి, నర్సింహులు, రమేష్, చందు, సందీప్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న దర్శనానికి యాదవ సంఘం నేతలు



స్వామివారిని దర్శించుకున్న అమరేందర్‌యాదవ్ తదితరులు

ముషీరాబాద్: కొమురవెల్లి మల్లన్న జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ముషీరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెద్దఎత్తున మల్లన్నస్వామిని దర్శించుకునేందుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా యాదవసంఘం ప్రతినిధులు అమరేందర్‌యాదవ్, కృష్ణయాదవ్, జగదీష్‌యాదవ్, యాదగిరియాదవ్, శివరాజ్‌యాదవ్, కొండల్‌యాదవ్‌లు మాట్లాడుతూ.. ప్రతి ఏటా కొమురవెల్లి మల్లన్న జాతరకు కుటుంబ సమేతంగా ముషీరాబాద్ యాదవ్ సంఘం నేతలు తరలివెళ్లి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. యాదవ కులస్తులలో ఐక్యతను పెంపొందించేందుకు తమవంతు కృషి చేస్తున్నామన్నారు.

మీడియాలో నాణ్యమైన ప్రసారాలకు ప్రాధాన్యం ఇవ్వాలి



మీడియా ప్రతిభా పురస్కారాలు ప్రదానోత్సవ సభలో పాల్గొన్న జస్టిస్ శేషశయనారెడ్డి

చిక్కడపల్లి: నేడు అన్ని రంగాల్లోనూ మీడియా మాధ్యమాల పాత్ర పెరిగిందని, ముఖ్యంగా న్యూస్ చానళ్లలో నాణ్యమైన ప్రసారాలు ఉండేలా చూసుకోవాలని జస్టిస్ శేషశయనారెడ్డి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ నిర్వహణలో మీడియా ప్రతిభా పురస్కారాలు ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వివిధ తెలుగు చానల్స్‌లో తెర వెనుక పనిచేసే సాంకేతిక నిపుణులు షేక్ అన్సారీ, కె.మురళీకృష్ణ, మదన్‌మోహన్, అమృత, స్వామి, అశోక్‌కుమార్, ప్రదీప్, సత్యనారాయణ, శివరావు, మనీష్‌కుమార్, నాగార్జున, రామకృష్ణ, బెల్దె హరినాథ్ గుప్తాలను ప్రతిభా పురస్కారాలతో సత్కరించి మాట్లాడారు. మారుమూల ప్రాంతాల్లో కూడా అక్షరాస్యత పెరిగినందున..టీవీలు, వార్తా పత్రికలు చూస్తున్నారన్నారు. కళాపోషకుడు చిల్లా రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించిన సభలో బొప్పన నరసింహారావు, కె.విజయలక్ష్మి, రవికుమార్ పాల్గొనగా సంస్థ అధ్యక్షుడు గుడిబండ వెంకటరెడ్డి స్వాగతం పలికారు.

యువతకు నేతాజీ స్ఫూర్తి ప్రదాత



నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ ఆవుల నిరంజన్, విద్యార్థులు

అంబర్‌పేట్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేటి యువతకు స్ఫూర్తి ప్రదాత అని హైమావతి పాఠశాల ప్రిన్సిపాల్ ఆవులు నిరంజన్ అన్నారు. మంగళవారం ప్రేమ్‌నగర్‌లోని పాఠశాల ప్రాంగణంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి నేతాజీ గొప్పతనాన్ని విద్యార్థులకు సందేశాత్మకంగా వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాచిగూడ: దేశ స్వాతంత్య్రం కోసం ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడిన భరతమాత ముద్దుబిడ్డ సుభాష్ చంద్రబోస్ నిత్య స్మరణీయుడని పలువురు వక్తలు కొనియాడారు. మున్నూరుకాపు ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి సందర్భంగా మంగళవారం కాచిగూడలోని మున్నూరుకాపుభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన దేశానికి సేవలను కొనియాడుతూ.. పలువురు ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు, మున్నూరుకాపు ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు కొండూరు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి కట్టెల సుభాష్, పుంజాల దత్తుమూర్తి, ఏనుగుల మాణిక్‌ప్రభు, కొంతం సురేష్‌బాబు, గోపాల రాధాకృష్ణ, ప్రహ్లాద్, సత్యనారాయణ, చెలిమెల రమేష్, ఆనంద్, శ్రీనివాస్ దయానంద్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మణికొండ వెంకటేశ్వర్లు, కొండూరు వినోద్‌కుమార్

నేడు డైరీ ఆవిష్కరణ

కవాడిగూడ: నేడు ఉస్మానియా యూనివర్సిటీలోని ఆంధ్ర మహిళాసభ కళాశాలలో తెలంగాణ రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీ, టేబుల్ కేలండర్‌ను బుధవారం ఉదయం 11 గంటలకు ఆవిష్కరిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సీ.హెచ్. పిచ్చయ్య, అసోసియేట్ సెక్రటరీ ఐలయ్య, ప్రధాన కార్యదర్శి పుల్లయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు ప్రొఫెసర్ కోదండరాం హాజరై ఆవిష్కరించనున్నట్లు వారు పేర్కొన్నారు. విద్యాభిమానులు, ఉపాధ్యాయులు, టీచర్లు పెద్దసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

రేపు డీడీసీఓపీ స్నాతకోత్సవం

నల్లకుంట: విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ (డీడీసీఓపీ) కళాశాల 20వ గ్రాడ్యుయేషన్‌డే (స్నాతకోత్సవం) గురువారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేశామని డీడీసీఓపీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఛాయ నందిని ఓ ప్రకటనలో తెలిపారు. విద్యానగర్ ఓయూరోడ్డులోని దుర్గాబాయిదేశ్‌ముఖ్ ఆస్పత్రి రీసెర్చ్‌సెంటర్ (డీడీహెచ్ఆర్‌సీ) ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ముఖ్య అతిథిగా ఉమ్మడి ఏపీ విశ్రాంత చీఫ్ సెక్రటరీ డాక్టర్ మోహన్‌కంద, అతిథులుగా డీడీఎంఎస్ అధ్యక్షురాలు ఎస్.ఉషారెడ్డి, విశ్రాంత ఐఏఎస్‌లు చక్రపాణి, ఐవైఆర్.కృష్ణారావు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీలో పీజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేస్తారని వివరించారు.

26న లౌకిక కవిగాయక సమ్మేళనం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత రాజ్యాంగం 74వ వేడుకల సందర్భంగా ఈనెల 26న సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో లౌకిక కవిగాయక సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతివెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ ప్రవేశికను చదివి ప్రతిజ్ఞ చేయించనున్నట్లు సమావేశంలో వివరించారు. జి.నరేష్, నాగేశ్వర్‌రావు, మహేష్ దుర్గే తదితరులు పాల్గొన్నారు.

అభినందన



విజేతలను అభినందిస్తున్న ఉప్పు సుధాకర్

అంబర్‌పేట్: కేఎస్ఎల్ స్మారక క్యారమ్‌బోర్డు క్రీడా చాంపియన్‌షిప్ విజేతలను క్రీడా రిఫరీ ఉప్పు సుధాకర్ అభినందించారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేట్‌లోని విజేతలైన కె.శ్రీనివాస్, ఆదిత్యలను ఆయన అభినందించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (35) ఫలక్‌నుమా – బుద్వేల్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా.. రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుడి ఒంటిపైన బూడిదరంగు టీ షర్టు, ఫ్యాంట్ ఉంది. వీపు వెనుక భాగంలో పుట్టుమచ్చ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలినడకన అయోధ్యకు..



గోల్నాక నుంచి బయలుదేరుతున్న భక్తులు

అంబర్‌పేట్: జై శ్రీరాధే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీరాముడిని దర్శించుకునేందుకు కాలినడకన అయోధ్యకు బయలుదేరారు. మంగళవారం గోల్నాక నుంచి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పుట్టి ప్రవీణ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ పాదయాత్ర నిజామాబాద్, నాగపూర్, ఫణానగర్, ప్రయాగ్‌రాజ్ మీదుగా 1329 కిలోమీటర్ల మేర నడుచుకుంటూ.. వెళ్తామన్నారు. నవీన్‌ముదిరాజ్, రాజేష్, ప్రేమ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులకు ఎంపీ సీట్లు కేటాయించాలి

కాచిగూడ: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన మున్నూరుకాపులకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మున్నూరుకాపులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని, మున్నూరుకాపులను గుర్తించి సీట్లు కేటాయించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. తమను విస్మరించే పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా అయోధ్య కరసేవలో పాల్గొన్న మున్నూరుకాపు ప్రతినిధులను ఘనంగా సత్కరించి అభినందించారు. మున్నూరుకాపు విద్యార్థి వసతిగృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు, యువక మండలి అధ్యక్షుడు హరీష్, మహిళా అధ్యక్షురాలు చామకూర సుజాత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌లల్లాతో హిందువుల కల సాకారం



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేత వినయ్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి: ఐదు దశాబ్దాల హిందువుల కల రామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠతో సాకారమైందని బీజేవైఎం మాజీ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ అన్నారు. ఎంతో మంది కరసేవకుల ప్రాణత్యాగానికి ప్రతీకగా రామజన్మభూమి నిలుస్తుందన్నారు. హిందూ బంధువుల చిరకాలవాంఛ నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. అయోధ్యలో భవ్యమైన రామమందిరం ప్రారంభమైన సందర్భంగా మంగళవారం గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ చౌరస్తాలో వినయకుమార్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించుకున్నారు. బీజేవైఎం నాయకులు మదన్మోహన్, ఆనంద్‌రావు, యాదగిరి, ఆకుల యాదగిరి, అభిషేక్, చిన్న, వరుణ్ పాల్గొన్నారు.

పాలనలో ప్రజలను భాగస్వామ్యం చేయాలి

లాలాపేట: సుపరిపాలన గురించి రామాయణం, మహాభారతంలో ప్రస్తావన ఉందని తార్నాకలోని రైల్వే డిగ్రీ కళాశాలకు చెందిన రిటైర్డు అసోసియేట్ ప్రొఫెసర్ పి. మోహన్‌రావు అన్నారు. కౌటిల్యుడు అర్థశాస్త్రంలో సుపరిపాలన గురించి వివరించారన్నారు. మంగళవారం సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో చాణక్య ఫోరం గుడ్ గవర్నెన్స్ డే సందర్భంగా గుడ్ గవర్నెన్స్ ఇనిషియేటివ్ ఇండియా అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. పరిపాలన పారదర్శకంగా జరగడంతో పాటు ప్రాథమిక హక్కులు పరిరక్షించాలన్నారు. గుడ్ గవర్నెన్స్‌పై నిర్వహించిన క్విజ్ పోటీలో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు.

నేత్రపర్వం.. తన్మయి నృత్య రూపకం



విద్యార్థిని శాస్త్రీయ నృత్యం



పాల్గొన్న ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయుడు

బంజారాహిల్స్: అయోధ్యలో శ్రీబాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా సైఫాబాద్ సైన్స్ కాలేజ్‌లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది ఈ వేడుకలో పాల్గొని ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.లక్ష్మణ్‌నాయక్, వెంకట్ నివాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, డాక్టర్ వి.జగదీశ్వర్ తదితరులు పాల్గొని వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా డిగ్రీ విద్యార్థిని తన్మయి శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. రామనామ స్మరణతో కళాశాల మార్మోగింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్–11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ తెలిపారు. నారాయణగూడ ఫీడర్ పరిధిలో బాగ్‌లింగంపల్లి, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, సూర్యనగర్, దత్తానగర్, దీపక్ థియేటర్, అరోరా డిగ్రీ కాలేజ్ తదితర ప్రాంతాల్లో 9.30 నుంచి 11.30, చిక్కడపల్లి ఫీడర్ పరిధిలో వేంకటేశ్వరస్వామి దేవాలయం, చిక్కడపల్లి, ఉమాగార్డెన్ తదితర ప్రాంతాల్లో 11.30 నుంచి 1.30 వరకు, గాంధీ కుటీర్‌ఫీడర్ పరిధిలో విఠల్‌వాడీ, శివాలయం దేవాలయం, నారాయణ కాలేజ్, హిమాయత్ నగర్ తదితర ప్రాంతాల్లో 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: రిపబ్లిక్‌డేను పురస్కరించుకుని శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించే దేశభక్తి గీతాల పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్ విభాగంలో 5 నుంచి 10 ఏళ్లలోపు, జూనియర్స్ విభాగంలో 11 నుంచి 20ఏళ్లు, సీనియర్స్ విభాగంలో 21ఏళ్లు పైబడిన వారంతా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు. అన్ని వయస్సుల వారికి ఈ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యేక విభాగాలుగా విభజించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకునేందుకు నేడు చివరి తేదీ అని వివరించారు. తాము ఆలపించిన ప్రైవేటు దేశభక్తి గీతాల వీడియో రికార్డింగ్ చేసి పంపించాలని సూచించారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు. ఆలిండియా రేడియో కళాకారుడు, గోల్డ్ మెడలిస్ట్ గౌరీభట్ల లక్ష్మణామూర్తి పర్యవేక్షణలో నిర్వహించే ఈ కార్యక్రమానికి వర్ధమాన గాయిణీమణులు యామిని, నందినిలు ఈవెంట్ మేనేజర్లుగా వ్యవహరిస్తారని చెప్పారు. ఔత్సాహికులు సెల్. 83749 27736 నంబరుకు వాట్సప్ పంపించాలని కోరారు.

28న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు..

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతిగృహం ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో ఈనెల 28న ఆదివారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్యహాల్‌లో మున్నూరుకాపు విద్యార్థులకు ప్రతిభాపురస్కారాల ప్రదానోత్సవం చేయనున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్‌లో 90శాతం మార్కులు, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థినీ,విద్యార్థులకు ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ రవిచారి

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ హరినగర్‌లో కేబుల్ ఆఫీస్ వద్ద నుంచి చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారి మంగళవారం పర్యవేక్షించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని పనులను వేగవంతం చేయడంతో పాటు త్వరగా పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ ఏఈ మురళిని కోరారు. బీజేపీ నాయకులు జనార్దన్, శ్రీనివాస్, శంకర్, సన్నీ తదితరులున్నారు.

30న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

నల్లకుంట: శ్రీ సరస్వతీ సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 30న శ్రీ త్యాగరాజస్వామి 176వ ఆరాధన ఉత్సవం, సరస్వతీ సంగీత విద్యాలయం 68వ వార్షికోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సంగీత విద్యాలయం అధ్యాపకురాలు యశస్విని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలోని ధ్యానమందిరంలో సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య అతిథిగా టీవీ దర్శక, నిర్మాత శోభాశంకర్ హాజరవుతారన్నారు. సంగీత విద్యాలయం విద్యార్థులు, సంగీతాభిమానులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



కవాడిగూడ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కార్పొరేటర్ రవిచారి అన్నారు. మంగళవారం స్థానిక కమ్యూనిటీహాల్‌లో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కలర్, బెల్ట్‌గ్రేడ్‌టెస్ట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రవిచారి హాజరై క్రీడాకారులకు బెల్ట్, సర్టిఫికెట్లతోపాటు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్షల్‌ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ, శరీరం దృఢంగా తయారవుతుందని తెలిపారు. సిరిగిరి కిరణ్‌కుమార్, బెల్ట్ ఎగ్జామినర్ మాస్టర్ కృష్ణ, స్థానిక నాయకులు శ్రీనివాస్‌నాయక్, వేణు, రవితోపాటు మార్షల్ ఆర్ట్స్‌కోచ్‌లు పాల్గొన్నారు.

రామనామస్మరణలో ర్యాలీ



గోల్నాకలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అంబర్‌పేట్: అయోధ్య రాముని ప్రాణప్రతిష్ఠ ర్యాలీ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. సోమవారం రాత్రి అంబర్‌పేట నియోజకవర్గవ్యాప్తంగా 'జై శ్రీరామ్' నినాదాలు మార్మోగాయి. రాత్రి పొద్దుపోయే వరకు శ్రీరాముడి నామస్మరణతో ఊరేగింపులు, ర్యాలీలు, భజనలు నిర్వహించారు. జైస్వాల్‌గార్డెన్‌లో ప్రత్యేక భజన కార్యక్రమాలు చేపట్టారు.

మహిళలకు ప్రాధాన్యం కల్పించాలి



సునీతరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: కార్పొరేషన్లలో మహిళలకు ప్రాధాన్యం కల్పించాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వరి కోరారు. ఈ మేరకు మంగళవారం మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు సునీతరావుని కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం గాంధీనగర్‌లో మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం నాయకులు కార్యకర్తలు సమన్వయంగా పనిచేయాలని సూచించారు.